# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

**ప్రాంతీయ వార్తలు**

**తేది : 05-11-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **బౌద్ధ మతం పురాతన మతంగా ఆసియా ఖండాన్ని ప్రభావితం చేసిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.**
2. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈరోజు డ్రోన్, ఐటీ, సెమీకండక్టర్ విధానాలపై సమీక్ష నిర్వహిస్తున్నారు.**
3. **రాష్ట్రంలో మహిళల భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వి.అనిత అన్నారు.**
4. **రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన కొన్ని గంటల్లోనే వారి ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.**
5. **పదోతరగతి సార్వత్రిక పరీక్షల రుసుము చెల్లింపు గడువును మరో వారంరోజులు పొడిగించినట్లు రాష్ట్ర విద్యాశాఖ తెలిపింది.**

==========================

బౌద్ధ మతం పురాతన మతంగా ఆసియా ఖండాన్ని ప్రభావితం చేసిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఢిల్లీలో కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, ఇంటర్నేషనల్ బౌద్ధ సమాఖ్య సహకారంతో నిర్వహించిన తొలి ఆసియా బౌద్ధ సదస్సులో రాష్ట్రపతి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భారత్ ఆశీర్వాద భూమి అని అన్నారు. బుద్ధగయలోని బోధి వృక్షం కింద సిద్ధార్థ గౌతముడికి జ్ఞానోదయం కావడం చారిత్రాత్మక సంఘటన అని రాష్ట్రపతి పేర్కొంటూ,

వాయిస్ ( 30సెకన్లు)

--------------------------

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈ రోజు డ్రోన్, ఐటీ, సెమీకండక్టర్ విధానాలపై సమీక్ష నిర్వహిస్తున్నారు. ఈ రోజు మధ్యాహ్నం పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై అధికారులతో అనంతరం రాష్ట్రంలో పెట్టుబడులకు సంబంధించి పెట్టుబడిదారులతో సమావేశాన్ని నిర్వహించనున్నారు.

--------------------------

రాష్ట్రంలో మహిళల భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వి.అనిత అన్నారు. అనంతపురం పోలీస్ శిక్షణా కళాశాల మైదానంలో ఈరోజు నిర్వహించిన 2023 బ్యాచ్ ట్రైనీ డిఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమంలో రాష్ట్ర డీజీపీ సి.హెచ్ ద్వారకా తిరుమల రావుతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,

వాయిస్ ( 31 సెకన్లు)

డీజీపీ ద్వారకాతిరుమల రావు మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో పోలీస్ శాఖకీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. త్వరలో ప్రతి జిల్లాకు ఒక సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నామని తెలిపారు.

-------------------------

ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం ప్రారంభించినప్పటి నుండి ఇప్పటి వరకు 2 కోట్ల 50 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ తెలిపింది. వీటిలో, మూడు దశల పరిశీలన అనంతరం 20 లక్షల కంటే ఎక్కువ మంది దరఖాస్తుదారులను అర్హులుగా గుర్తించినట్లు పేర్కొంది. దేశ వ్యాప్తంగా చేతివృత్తుల వారికి సాధికారత కల్పించే లక్ష్యంతో గతేడాది సెప్టెంబర్‌లో ప్రారంభించిన ఈ పథకం విజయవంతంగా అమలవుతోందని దాదాపు 10 లక్షల నమోదిత కళాకారులు ఇ-వోచర్ల ద్వారా 15 వేల రూపాయల వరకు ప్రోత్సాహకాలను అందుకున్నారని తెలిపింది.

-------------------------

రాష్ట్రంలోని కరవు మండలాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం అమలుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం సత్యసాయి, అన్నమయ్య, కర్నూలు, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లోని 54 మండలాల్లో గ్రామ సభలు నిర్వహించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖను ఆదేశించింది. గ్రామాల్లో వర్షపు నీటి సంరక్షణకు వీలుగా పది రకాల పనులను గుర్తించాలని నిర్ణయించింది. ఇందుకు ప్రత్యేక మార్గదర్శకాలను రూపొందించి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆయా జిల్లాల కలెక్టర్లకు పంపింది.

-------------------------

రాష్ట్రంలో మాదకద్రవ్యాలు, అక్రమ మద్యం నియంత్రణపై అధ్యయనం, సిఫార్సుల కోసం రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. హోం మంత్రి వి.అనిత ఛైర్మన్‌గా, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌లను సభ్యులుగా నియమించింది. ఈ ఉపసంఘం రాష్ట్రంలో గంజాయి, మాదకద్రవ్యాల సాగు, నాటుసారా తయారీ, వాటి విస్తృతి, వినియోగం వంటి అంశాలపై సమగ్ర అధ్యయనం చేసి వాటిపై నివేదిక సమర్పిస్తుందని ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

-------------------------

పండుగల రద్దీ దృష్ట్యా ప్రయాణికుల సౌకర్యార్థం భారతీయ రైల్వే దేశవ్యాప్తంగా 7 వేల 435 ప్రత్యేక రైళ్లను రైల్వే నడుపుతోంది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది అదనంగా 4 వేల 500 ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఇందులో భాగంగా దక్షిణ మధ్య రైల్వే 860 రైళ్లను నడుపుతుండగా, ఈ రోజు 28 ప్రత్యేక రైళ్లను నడుపుతోంది.

---------------------------

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సక్షం కార్యక్రమం కింద అన్నమయ్య జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలను ఆధునీకరించనున్నారు. ఈ కార్యక్రమంపై మా ఆకాశవాణి అన్నమయ్య జిల్లా ప్రతినిధి ఎన్.సుదర్శన్ రెడ్డి మరింత సమాచారాన్ని అందజేస్తారు.

వాయిస్ ( 30 సెకన్లు)

---------------------------

రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన కొన్ని గంటల్లోనే వారి ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం కాపవరం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. కేంద్రాల వద్ద ధాన్యం నాణ్యత విషయంలో ప్రమాణాలు పరిశీలించిన తర్వాతే కొనుగోలు చేయాలని అధికారులకు మంత్రి సూచించారు.

---------------------------

పదోతరగతి సార్వత్రిక పరీక్షల రుసుము చెల్లింపు గడువును మరో వారం రోజులు పొడిగించినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు దేవానందరెడ్డి తెలిపారు. మొదట ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 11వ తేదీ వరకు ఎలాంటి అదనపు చెల్లింపులూ లేకుండా రుసుము చెల్లించేందుకు అవకాశం ఉండగా.. దీన్ని ఈ నెల 18 వరకు పొడిగించామని తెలిపారు. 50 రూపాయల అదనపు చెల్లింపుతో ఈ నెల 25 వరకు, 200 రూపాయలతో డిసెంబరు 3 వరకు, 500 అదనపు రుసుముతో డిసెంబరు 10 వరకు చెల్లించేందుకు అవకాశం ఉందని తెలిపారు.

---------------------------

ఆస్ట్రేలియాలో జరుగుతున్న 67వ కామన్‌వెల్త్ పార్లమెంటరీ సదస్సులో రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి పాల్గొన్నారు. ఈ సదస్సులో పలు అంశాలపై ఆమె ప్రసంగించారు. కామన్‌వెల్త్ మహిళా పార్లమెంటు స్టీరింగ్ కమిటి చర్చల్లో భారత్ తరపున పాల్గొనే అవకాశం రావడం గర్వించదగ్గ విషయమని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆమె సంతోషం వ్యక్తం చేసారు.

---------------------------

కేంద్ర ప్రాయోజిత పథకాలను అనుసంధానం చేస్తూ రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ 20 సూత్రాల కార్యక్రమం అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పాత్రికేయులతో ఆయన నిన్న మాట్లాడుతూ, నీతి ఆయోగ్ సూచించిన అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా స్వర్ణాంధ్ర -2047 సాధనకు 20 సూత్రాల కార్యక్రమాన్ని అమలు చేసేందుకు సంబంధిత శాఖలతో కలిసి చర్యలు చేపడుతున్నామని అన్నారు.

---------------------------

ప్రముఖ సాహితీవేత్త ఆలూరి బైరాగి శత జయంతి ఈరోజు. 1925వ సంవత్సరం నవంబర్ 5వ తేదీన గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలో జన్మించిన ఆయన జీవితంలోని కష్ట సుఖాల బహురూప వర్ణనను కవిత్వంగా

మలిచారు. హిందీ "చందమామ" పత్రికకు సంపాదకునిగా పనిచేశారు. 1978 సెప్టెంబర్ 9వ తేదీన తుది శ్వాస విడిచిన ఆలూరి బైరాగికి 1984 సంవత్సరంలో ఆయన రచించిన "ఆగమ గీతిక" రచనకు మరణాంతర కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం లభించింది.

---------------------------

ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి నర్సింగ్ కళాశాలల్లో బీఎస్సీ నర్సింగ్ నాలుగేళ్లు, రెండేళ్ల కోర్సులకు రెండో విడత కౌన్సెలింగ్‌కు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విజయవాడ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈరోజు నుంచి ఈ నెల 7వ తేది వరకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోచ్చని పేర్కొంది.

---------------------------

శ్రీ సత్యసాయి జిల్లాని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. పుట్టపర్తిలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులతో మంత్రి నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాను అభివృద్ధి చేసేందుకు ఆయా శాఖల అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలకు క్షేత్ర స్థాయిలో అందేలా అధికారులు పనిచేయాలని మంత్రి సూచించారు.

======================